క్లుప్తంగా

'వై ఏపీ నీడ్స్ జగన్'పై సమీక్ష



సచివాలయ సిబ్బంది, నాయకులతో సమీక్షిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు మధుసూదన్ నగర్, కస్తూరినగర్ సచివాలయాల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, స్థానిక నాయకులతో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఈ నెల 28, 29 తేదీల్లో 46వ వార్డులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొంటారన్నారు. ప్రతి లబ్ధిదారుడు కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. కో ఆప్షన్ సభ్యుడు ఎస్.అప్పారావు, చిన్న, రామారావు, లావణ్య, విజయలక్ష్మి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ డే



పోటీల విజేతలతో ఎన్‌సీసీ ఉన్నతాధికారి విశ్వనాథం

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో ఆదివారం ఎన్‌సీసీ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఎన్‌సీసీ ఉన్నతాధికారి ఎం.ఎస్.వి.విశ్వనాథం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు పరుగు పందెం, డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రెయినింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. డ్రిల్‌లో ఎం.శృతి, ఎ.శ్రావణి, ప్రవీణ్‌కుమార్, పి.హర్ష విజేతలుగా నిలిచారు. వెపన్ ట్రెయినింగ్, మ్యాప్ రీడింగ్‌లో కె.యమున, టి.నవ్యశ్రీ, కె.రోహిత్, రోషన్ గెలుపొందారు. పరుగు పందెంలో ఎ.భార్గవి, షేక్ చాందిని, జి.శివ, వి.గోపీచంద్ విజయం సాధించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ నరస, కల్నల్ అజయ్‌కుమార్, సుబేదార్ మేజర్ సజీవన్ పాల్గొన్నారు.

డాక్టర్ మురళీమోహన్‌రావుకు ఐఎంఏ అవార్డు



అవార్డు అందుకుంటున్న మురళీమోహన్‌రావు

మహారాణిపేట: కోవిడ్ సమయంలో అందించిన సేవలకు గుర్తింపుగా విశాఖకు చెందిన డాక్టర్ ఎం.వి.వి.మురళీమోహన్‌రావుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) అవార్డు ప్రదానం చేసింది. ఆదివారం మంగళగిరిలో జరిగిన ఐఎంఏ రాష్ట్ర స్థాయి సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీహరిరావుల నుంచి ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా డాక్టర్ మురళీమోహన్‌రావు వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ఐఎంఏ నాయకులు జె.సి.నాయుడు, డాక్టర్ సమరం, డాక్టర్ సి.ఎ స్.రాజు, వి.అశోకన్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా జీవించాలని వారికి సూచించారు. పలు హత్య కేసుల్లో ఉన్న నిందితులకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జంక్షన్లు జిగేల్..!



రైల్వే న్యూకాలనీ కూడలిలో నిర్మించిన రైలింజిన్ ఫౌంటైన్ వద్ద రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

మహా విశాఖ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. పరిపాలన రాజధాని కానున్న విశాఖను అన్ని విధాలా ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రధాన కూడళ్ల ఆధునికీకరణకు చర్యలు చేపట్టారు. గతంలో నగరంలోని ప్రధాన రహదారుల్లో జంక్షన్ల పరిస్థితి అధ్వానంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఆ పరిస్థితి మారింది. స్మార్ట్ సిటీకి తగ్గట్టు ప్రధాన కూడళ్లను శరవేగంగా అభివృద్ధి చేశారు. ప్రయాణికులు, పర్యాటకులు, నగర ప్రజలను ఆకట్టుకునేలా లక్షల రూపాయల నిధులతో వాటిని ఆధునికీకరించి చూడముచ్చటైన కళాఖండాలను ఏర్పాటు చేశారు.



- చూడముచ్చటగా ప్రధాన కూడళ్ల ఆధునికీకరణ
- నగరానికి మరో ల్యాండ్‌మార్క్‌లా సుందరీకరణ
- స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తాటిచెట్లపాలెం/సీతంపేట: నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల్లో గల జంక్షన్లకు మహర్దశ పట్టింది. స్మార్ట్ సిటీ నిధులతో ఆయా కూడళ్లను ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నారు. ప్రత్యేకంగా జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లో సుందరమైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఇక్కడి రహదారిని మూసివేశారని, దారి ఇరుకైపోయిందని విమర్శలు చేసిన వారికి సమాధానం సిద్ధమైంది. ఈ కూడలిని స్మార్ట్ సిటీ నిధులు రూ.1.70కోట్లతో అద్భుతంగా తీర్చిదిద్దారు. అందమైన ఫౌంటైన్ నిర్మించి. జంక్షన్ మధ్యలో రైలింజన్, చుట్టూ ఆధునిక పేమెంట్ టైల్స్, ఐ లవ్ వైజాగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలను కల్పించారు.

సాయంత్రం వేళల్లో పిల్లలు, పెద్దలు ఇక్కడికి వచ్చి సేద తీరుతూ.. ప్రత్యేక రైలింజన్, ఐ లవ్ వైజాగ్ వద్ద ఫొటోలకు ఆసక్తి చూపిస్తున్నారు. సువిశాలమైన రోడ్లు, అంతే విశాలంగా జంక్షన్‌ను అభివృద్ధి చేయడంతో వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా ప్రయాణాలు సాగుతున్నాయి.

ట్రాఫిక్ సమస్యలకు చెక్

నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సాఫీగా ప్రయాణాలు సాగించేలా ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేశారు. రూ.96 లక్షల స్మార్ట్ సిటీ నిధులతో అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో మహారాణి పార్లర్ కూడలి అభివృద్ధి పనులు రెండు నెలలుగా జరుగుతున్నాయి.

మహారాణి పార్లర్ జంక్షన్‌లో నాలుగు వైపులా రహదారిని విస్తరించారు. ఫుట్‌పాత్స్, టేబుల్ టాప్స్, సెంటర్ ఐలాండ్, కోబుల్ స్టోన్ ఫ్లోరింగ్‌తో కూడలిని ఆధునికంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కూడలి మధ్యలో అందంగా వాటర్ ఫౌంటైన్ నిర్మించి విద్యుత్ దీపాలతో లైటింగ్ ఏర్పాటు చేశారు.



మహారాణి పార్లర్ కూడలిలో కోబుల్ స్టోన్‌తో ఏర్పాటు చేసిన టేబుల్ టాప్



రైల్వే న్యూకాలనీ జంక్షన్ వద్ద ఐ లవ్ వైజాగ్ లోగో



అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ వద్ద జంక్షన్‌లో నిర్మించిన వాటర్ ఫౌంటైన్

జోరుగా విస్తరణ పనులు

- అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి సీసీ డ్రెయిన్ నిర్మిస్తున్నారు. దానిపై భాగంలో సిమెంట్ పలకలు వేసి ఫుట్‌పాత్‌లు నిర్మించనున్నారు.
- దొండపర్తి కూడలి నుంచి జాతీయ రహదారి వరకు విస్తరించి ఉన్న అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, సత్యం సెంటర్ నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ఉన్న సీతమ్మధార మెయిన్ రోడ్ విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో దొండపర్తి కూడలి నుంచి మహారాణి పార్లర్ వరకు 60 అడుగుల రోడ్‌గా.. మహారాణి పార్లర్ నుంచి హైవే వరకు 80 అడుగుల రోడ్‌గా విస్తరణ చేపడుతున్నారు. జంక్షన్ల అభివృద్ధి, రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ఈ మార్గంలో ట్రాఫిక్ వెతలు చాలా వరకు తీరతాయని వాహన చోదకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.70 కోట్లతో రైల్వే న్యూకాలనీ జంక్షన్ ఆధునికీకరణ

రూ.96 లక్షలతో మహారాణి పార్లర్ కూడలి అభివృద్ధి

ఆకర్షణీయంగా రైల్వే న్యూకాలనీ జంక్షన్



తాటిచెట్లపాలెం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే వీఐపీ రోడ్‌లో రైల్వే న్యూకాలనీ జంక్షన్ చాలా అందంగా మారింది. ప్రత్యేక రైలింజన్, ఫౌంటైన్ నగరవాసులను ఎంతో ఆకర్షిస్తోంది. దీని గురించి ఇంకా చాలా మందికి తెలియడం లేదు. ఇప్పుడిప్పుడే ఈ కూడలి విశిష్టత తెలుస్తోంది.

– చందనసాయి, తాటిచెట్లపాలెం

సాయంత్రం వేళ సేదతీరుతున్నాం



రైల్వే న్యూకాలనీ జంక్షన్‌లో జరిగిన పనులు చూస్తే చాలా ఆశ్చర్యం కలుగుతోంది. సాయంత్రం వేళల్లో చిన్న పిల్లలను ఎక్కడో బీచ్ రోడ్‌కు తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే కాసేపు సరదాగా గడపవచ్చు. సెల్ఫీలు తీసుకోవచ్చు. ఈ జంక్షన్‌ను చూసిన వారంతా ఎంతో సంతోషిస్తున్నారు.

– కనకమహాలక్ష్మి, రైల్వే న్యూకాలనీ

అపోహలు, ఇబ్బందులు తొలగాయి



రైల్వే న్యూకాలనీ కూడలిలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ సమయంలో ఇక్కడ ఏం చేస్తారో, రోడ్లు ఇరుకై పోతున్నాయని అనేక రకాలుగా అపోహలు కలిగాయి. పనులు పూర్తయిన తరువాత ఆ ఇబ్బందులను మరచిపోయాం. చెంతనే ఇంత మంచి జంక్షన్ రూపుదిద్దుకోవడంతో మా ప్రాంతవాసులకు ఎంతో ఆనందంగా ఉంది.

– రిజ్వాన్ ఖాన్, రైల్వే న్యూకాలనీ

ట్రాఫిక్ వెతలు తీరనున్నాయి



దశాబ్దాలుగా అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో ట్రాఫిక్ సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమంతోపాటు అభివృద్ధిపై దృష్టి సారించారు. ట్రాఫిక్ వెతలు తీరేలా రూ.96 లక్షల వ్యయంతో అక్కయ్యపాలెం ప్రధాని రహదారిని వెడల్పు చేస్తున్నారు. మహారాణి పార్లర్ కూడలిని చూడముచ్చటగా అభివృద్ధి చేశారు.

– కింతాడ శ్రీను, అక్కయ్యపాలెం

రాజ్యాంగ రక్షణే దేశభక్తి

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం



బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు, నాయకులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్, అధికారులు

సీతమ్మధార: భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే నిజమైన దేశభక్తికి నిదర్శనమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజవకర్గ సమన్వయకర్త కె.కె.రాజు పేర్కొన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కె.కె.రాజు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర రావు, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు, మండల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో..

గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి సంస్థ డైరెక్టర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పీఠిక చదివి డైరెక్టర్లతో పాటు ఉద్యోగులంతా ముక్తకంఠంతో ప్రతిజ్ఞ చేశారు. డైరెక్టర్లు బి.రమేష్‌ప్రసాద్, డి.చంద్రం, సీజీఎం అచ్చి రవికుమార్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో..

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డివిజన్‌లోని అన్ని స్టేషన్లు, డిపోల్లో అధికారులు, సిబ్బంది రాజ్యాంగ ఉపోద్ఘాత ప్రతిని చదివారు. ఏడీఆర్‌ఎంలు సుదీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇతర బ్రాంచీల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద రాజ్యాంగ ప్రతిని చదువుతున్న రైల్వే అధికారులు, ఉద్యోగులు

అతి పెద్దది మన రాజ్యాంగం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్దదైన భారత రాజ్యాంగ గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకుని పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, బి.తిరుమలరావు, మెట్ట దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, రెయ్యి గణేష్, సారిక నూకరాజు, ధర్మావతి, రాజేశ్వరరావు, మోహన్‌రావు, జగన్, ఉప్పాడ అప్పలరాజు, డి.శ్రీను, ఎం.శ్రీను, చిన్ని, సాధు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే రాజ్యాంగ హక్కుల సాధన



మాట్లాడుతున్న కవి గొడిశాల జయరాజ్

సీతంపేట: రాజ్యాంగ బద్ధంగా మనం నడుస్తుంటే మనువాదులకు ఇష్టం లేదని, హక్కులను కాలరాస్తున్నారని కవి, రచయిత గొడిశాల జయరాజ్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో భారత రాజ్యాంగం–సమన్యాయం అనే అంశంపై ఏఎంఎస్ నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగ హక్కులు సాధించుకోవాలంటే ఐకమత్యం, మనలో చైతన్యం అవసరమన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు తీసుకొచ్చి, దళితుల్లో చీలికలు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ మనువాద రాజ్యంలోకి, బానిస వ్యవస్థలోకి వెళ్లిపోయే ప్రమాదముందన్నారు. ఈ వ్యవస్థను మార్చే శక్తి మనకుందని, మన పిల్లలను అంబేడ్కర్ వారసులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లా యూనివర్సిటీ మాజీ వీసీ వై.సత్యనారాయణ, ఏఎంఎస్ అధ్యక్షుడు బొద్దు కల్యాణరావు, కేజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ జి.అర్జున, డాక్టర్ జి.జయరాజ్, ఏఎంఎస్ ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, న్యాయవాది పి.వి.గిరిధర్, ఏఎంఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కనుల పండువగా జ్వాలాతోరణ మహోత్సవం



సీతంపేట పార్వతీశ్వరాలయం వద్ద జ్వాలాతోరణ వెలుగులు



రైల్వే న్యూకాలనీ ఉమా నీలకంఠేశ్వరాలయం వద్ద జ్వాలాతోరణం వెలిగిస్తున్న గణేష్

సీతంపేట: కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. సీతంపేట పార్వతీశ్వరాలయం వద్ద ఆదివారం రాత్రి జ్వాలాతోరణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కర శర్మ తోరణం వెలిగించారు. పార్వతీశ్వరుడు శయనిస్తున్న బాలశివుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ నమ్మి పద్మా వెంకట్, ఇప్పిలి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

- శంకరమఠం రోడ్‌లోని రామలింగేశ్వరాలయం వద్ద జ్వాలాతోరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా మేళతాళాలతో రామలింగేశ్వరుడి ఉత్సవ మూర్తుల తిరువీధి మహోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో రమాభాయి, కమిటీ చైర్మన్ బొడ్డేటి కిరణ్‌కుమార్, సభ్యులు పర్యవేక్షించారు.

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఉమా నీలకంఠేశ్వరాలయంలో జ్వాలాతోరణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మొల్లేటి వీరగణపతిరావు(గణేష్), ఎక్స్ ఆఫీషియో మెంబర్, ఆలయ అర్చకులు బాదంపూడి నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్పటిక లింగం

మద్రిపాలెం: స్థానిక గాంధీనగర్–2లోని శ్రీపార్వతీ సమేత అమృత లింగేశ్వర స్వామి స్పటిక లింగ ఆలయంలో జ్వాలాతోరణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. యువ సేన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని, అర్చకుడు జయంతి సూర్యశర్మ ఆధ్వర్యంలో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకురాలు పేడాడ రమణకుమారి, సనపల కీర్తి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పెండింగ్ కేసుల పరిష్కారం



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులను పరిశీలిస్తున్న ఈస్ట్ ఏసీపీ మూర్తి

సీతమ్మధార: పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈస్ట్ ఏసీపీ డి.ఎస్.ఆర్. వి.ఎస్.ఎన్. మూర్తి ఆదేశించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. సిబ్బంది వివరాలు, వారి విధుల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. పాత నేరస్తుల రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్, వ్యాపార సంస్థలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణను పరిశీలించారు. ఏసీపీ వెంట సీఐ ఎస్.విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా ఎస్ఐగా శ్రీను



సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ ఎస్ఐగా కె.శ్రీను ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఆయన విశాఖ రూరల్, వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్లలో క్రైం ఎస్ఐగా పనిచేశారు. సాధారణ బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన అప్పలరాజును ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐగా బదిలీ చేశారు.

కులం పేరుతో దూషణపై ఫిర్యాదు

మద్రిపాలెం: కులం పేరుతో దూషించారని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం జయప్రకాష్ నగర్‌లో టి.మౌనిక అనే వివాహిత తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నారు. గతంలో నగరంలోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసినపుడు ఢిల్లీకి చెందిన అమిత్ కక్కర్‌ను 2021 జూలైలో ప్రేమ వివాహం చేసుకున్నారు. తరువాత కంచరపాలెంలోనే నివాసముంటూ, కొంతకాలం బాగానే ఉన్నారు. 2022 అక్టోబర్‌లో ఢిల్లీకి వెళ్లిపోయారు. అత్తమామలు, భర్త కలిసి కట్నం, ఆస్తి కోసం వేధించడం, కులం పేరుతో దూషించడం ప్రారంభించారు. ఈ వేధింపులు తాళలేక మౌనిక 2022 డిసెంబర్‌లో కంచరపాలెంలోని అమ్మ ఇంటికి వచ్చేసింది. భర్త నచ్చజెప్పడంతో డిసెంబర్‌లోనే మళ్లీ ఆమె ఢిల్లీ వెళ్లింది. అక్కడ మళ్లీ అందరూ వేధింపులకు దిగడంతో ఉద్యోగం నిమిత్తం విశాఖ వచ్చేశారు.ఆమె తల్లిదండ్రులతో కలిసి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

చెస్ టోర్నీ విజేతలకు ట్రోఫీలు



ట్రోఫీ అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మద్రిపాలెం: మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో రెండో రోజు ఫస్ట్ స్టేట్ ఓపెన్ రోలింగ్ చెస్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఎంగ్రవ్ చెస్ అకాడమీ, శ్రీ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ రంగల బాబూరావు పేరిట నిర్వహించిన ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. విశాఖకు చెందిన గొర్లె నయన ఫస్ట్ విన్నర్‌గా, ముమ్మన వెంకట రుత్విక్ సెకండ్ విన్నర్‌గా నిలిచినట్లు టోర్నీ నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ముఖ్య అతిథి 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో చెస్ అకాడమీ సభ్యులు కె.వి.వి.శర్మ, జ్వాలాముఖి, సురేష్, ఆర్.బాబూరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

మద్రిపాలెం: ఒక కళాశాల విద్యార్థిని అదృశ్యమైనట్టు కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కడజాల యశస్విని అనే విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి కంచరపాలెం ఇందిరానగర్–4లో నివసిస్తోంది. నగరంలోని ఒక కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఎప్పటిలానే ఈ నెల 21న కళాశాల నిమిత్తం వెళ్లి ఇంటికి రాలేదు. తెలిసిన వారిని విచారించినా ఫలితం లేకపోవడంతో విద్యార్థిని తండ్రి రమణ ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి పర్యవేక్షణలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటాలి



వెటరన్ క్రీడాకారులకు టీషర్ట్‌లు అందిస్తున్న బుచ్చయ్య, చంద్రమౌళి

మురళీనగర్: నగరానికి చెందిన వెటరన్ అథ్లెటిక్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి పతకాలు సాధించాలని వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య ఆకాంక్షించారు. ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు ఉండడం గర్వకారణమన్నారు. డిసెంబర్ 9, 10 తేదీల్లో ప్రకాశం జిల్లాలో నిర్వహించనున్న చాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారులను అభినందించారు. వారికి బుచ్చయ్య, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి టీషర్ట్‌లను అందించారు. కార్యక్రమంలో వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మంగ వరప్రసాద్, కోశాధికారి ఎం.రామారావు, కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, అసోసియేషన్ సభ్యులు వీరభద్రరావు, ఎస్.జల ఉష, ఎం.బాలరాజు, శశికుమార్, హెల్త్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ రాజు, డి.సరోజిని, క్రీడాకారులు పాల్గొన్నారు.